క్లుప్తంగా

గుర్తింపు కార్డుల పంపిణీ



ఉదయగిరి రూరల్: పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని 60 మంది విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు కటారు వెంకటరత్నం తన సొంత నిధులతో గుర్తింపు కార్డులు, టైలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం జీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఏటా విద్యార్థులకు విశ్రాంత గుర్తింపు కార్డులను అందజేస్తున్న వెంకటరత్నాన్ని అభినందించారు.

ఉదయగిరిలో మోస్తరు వర్షం



ఉదయగిరి: మండలంలో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై సుమారు గంటపాటు వర్షం పడింది. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు, వర్షపు నీరు ఏకమై రోడ్లపై ప్రవహించడంతో పాదచారులు, వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. కాగా సాగులో ఉన్న మెట్ట, ఉద్యాన పంటలకు వర్షం కొంత మేర ఊరట కల్పించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలను సోమవారం పంపిణీ చేశారు. మండల విద్యావనరుల కేంద్రంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు 9,530 పాఠ్యపుస్తకాలు వచ్చాయని తెలిపారు.

బీమా చెక్కు పంపిణీ



ఆత్మకూరురూరల్: మండలంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మహిమలూరు శాఖలో పీఎం జేజేబీఓ బీమా లబ్ధిదారుడికి నగదు చెక్కును మేనేజర్ ఫిరోజ్, ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్లు రాజేష్‌కుమార్, విజయ్‌కుమార్, పెంచలస్వామి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిమలూరుకు చెందిన పానుగంట భాగ్యలక్ష్మి ఇటీవల మరణించగా నామినీగా ఉన్న పానుగంట శ్రీనివాసులుకు రూ.2 లక్షల చెక్కును అందజేశామని తెలిపారు.

పరామర్శ



వరికుంటపాడు: మండలంలోని కనియంపాడులో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గుర్రం భాస్కర్ రెడ్డి తల్లి సుబ్బమ్మ ఉత్తరక్రియలకు ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. సుబ్బమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన వెంట పార్టీ వరికుంటపాడు, కలిగిరి మండలాల అధ్యక్షులు మందలపు తిరుపతినాయుడు, కాటం రవీంద్రరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ షేక్ అలీఅహ్మద్, నాయకులు మాగంటి శ్రీనివాసులు, బొడ్డు వెంకటేశ్వర్ రెడ్డి, రామకృష్ణ, శేఖర్, నాగరాజు, నాగభూషణ్, గోను శ్రీకాంత్‌రెడ్డి,తదితరులు ఉన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



కావలి(అల్లూరు): పట్టణంలోని పీటర్‌పాల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు దేవరకొండ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పేదలకు దుస్తులను సోమవారం పంపిణీ చేశారు. తన కుమారుడు ప్రీతమ్‌పాల్ మేనల్లుడు రాహుల్‌పాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని 500 మంది పేదలకు దుస్తులను అందజేసినట్లుగా ఆయన తెలిపారు.

ఉపాధి పనులపై సమీక్ష

వరికుంటపాడు: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ మృదుల హాజరై మండలంలో ఉపాధి పథకం కింద చేపడుతున్న ఉద్యాన తోటల పెంపకం, సోక్‌పిట్స్, ఫారంపాండ్స్, తదితర పనులపై సమీక్షించారు. ఎంపీడీఓ రమణారెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ అజాంఖాన్, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

లక్షలు వ్యయం..ప్రయోజనం శూన్యం

- ఉపాధి నిధులతో నీటితొట్ల నిర్మాణం
- నీటి వసతి కల్పించక నిరుపయోగం
- దాహంతో అల్లాడుతున్న మూగజీవాలు



సీతారామపురంలోని పోతురాజు అరుగు వద్ద నిరుపయోగంగా నీటితొట్టి

సీతారామపురం : మండలంలోని పలు గ్రామాల్లో మూగజీవాల కోసం లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన నీటి తొట్టెలు నిరుపయోగంగా మారాయి. నీటి తొట్లను నీటితో నింపే దిక్కులేక మూగజీవాలు దాహంతో అల్లాడుతున్నాయి. ప్రభుత్వం మూగజీవాల దాహార్తిని తీర్చే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం కింద నీటి తొట్లను మంజూరు చేసింది. అందులో భాగంగా మండలానికి 28 నీటితొట్లను మంజూరు చేయగా, అందులో 19 నిర్మాణాలు పూర్తయ్యాయి. ఒక్కో నీటి తొట్టి నిర్మాణానికి సుమారు రూ.33 వేల వరకు ఖర్చు చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో ఎంతో ఆర్భాటంగా నీటి తొట్ల నిర్మాణం చేపట్టిన అధికార యంత్రాంగం ఆ తరువాత వాటిని గాలికి వదిలేసింది. నీటితొట్లను నిర్మించడం వరకే తమ పని అన్నట్లు నీటి వసతి కల్పనను పట్టించుకోవడం లేదు. నీటి తొట్లను ఎవరు నింపాలి..ఎవరు పర్యవేక్షించాలన్న దానిపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో పంచాయతీ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో నీటితోట్లు నిరుపయోగంగా మారడంతో మూగజీవాలు దాహంతో అల్లాడుతున్నారు. ఇప్పటికైనా మండలాధికారులు స్పందించి నీటితోట్లను నీటితో నింపి మూగజీవాల దాహార్తిని తీర్చాలని పశుపోషకులు కోరుతున్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్ రామ్మోహన్

ఉదయగిరి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తహసీల్దార్ ఎల్ రామ్మోహన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను సోమవారం తహసీల్దార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో రాణించడం వల్ల ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యం ఉంటుందన్నారు. మండల స్థాయి నుంచి జాతీయస్థాయి వరకు క్రీడల్లో రాణించవచ్చన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు క్రీడలపై మక్కువ కనబరచాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ శ్రీనివాసులు, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి డీవీవీ ప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్లు ఖాజారియాజ్, నయీమా, తబిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏలు

మర్రిపాడు: వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీఆర్‌ఏలకు నిబంధనలకు విరుద్ధంగా డ్యూటీలు వేస్తున్నారన్నారు. ఏళ్ల తరబడి అతితక్కువ వేతనంతో పనిచేస్తున్నారన్నారు. అదనపు పని భారానికి తోడు ఆర్థిక సమస్యలతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందన్నారు. కూటమి ప్రభుత్వానికి 15 నెలలుగా తమ సమస్యలను విన్నవిస్తున్నా పరిష్కరించడం లేదన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారానికి ఈ నెల 13, 14 తేదీల్లో దీక్షలు, 15న ధర్నా కార్యక్రమాన్ని విజయవాడలోని అలంకార్ సెంటర్ వద్ద చేపడుతున్నట్లు తెలిపారు.

పందుల పెంపకందారుడిపై ఫిర్యాదు

సోమశిల: చేజర్ల మండలం ఆదురుపల్లిలో పందులను పెంచుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న వ్యక్తిపై పంచాయతీ కార్యదర్శి రఫీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ గ్రామానికి చెందిన దయాకర్ అనే వ్యక్తి గత ఏడేళ్లుగా పందులను పెంచుతూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గ్రామంలో పందులను విచ్చలవిడిగా వదిలేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజల ఫిర్యాదుతో పందులను దూరంగా తరలించాలని పలుమార్లు హెచ్చరించినా కాలయాపన చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల బహిర్భూమికి వెళ్లిన పెంచలమ్మపై పందులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడిందని తెలిపారు. దీంతో గ్రామస్తులు హడలిపోతున్నారన్నారు. మరోవైపు పందులు రోడ్ల వెంబడి తిరుగుతూ అడ్డు వస్తుండడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. గ్రామంలో పందులను పెంచకుండా చర్యలు తీసుకుని వాటి బెడద నుంచి గ్రామస్తులను కాపాడాలని కోరారు.

విద్యతో ఉన్నత శిఖరాలు



కావలి(అల్లూరు): విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని నడింపల్లికి చెందిన దాతలు చన్నా రామాంజనేయులు, చన్నా కొండలరావు పేర్కొన్నారు. కావలి మండలం నడింపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫామ్‌ను సోమ వారం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన పేద విద్యార్థులే ఎక్కువగా ఉన్నారన్నారు. ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన యూనిఫామ్‌ను కుట్టించుకునే పరిస్థితి లేదన్నారు. తమ వంతుగా రూ.12 వేలు వెచ్చించి కుట్టించి అందజేశామని తెలిపారు. ఉపాధ్యాయులు శానం కృష్ణ, బూచి మధుసూదన్‌రావు, గ్రామపెద్దలు వెంకయ్య, నాగూర్, నగేష్, ధనుష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలని వినతి

కావలి(అల్లూరు): కావలిలోని ముసునూరు వినాయక కాలనీకి విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పీ పెంచలయ్య కోరారు. ఈ మేరకు కావలి ఆర్డీఓకు కాలనీవాసులతో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. కాలనీ ఏర్పాటై దాదాపు 10 ఏళ్లు గడిచినా ఇప్పటికీ విద్యుత్ సౌకర్యం లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని విన్నవించారు.

మూణ్నాళ్ల ముచ్చటగానే వెలుగులు



దుత్తలూరు సెంటర్‌లో వెలగని దీపాలు

దుత్తలూరు: దుత్తలూరు సెంటర్‌లో 167–బీజీ జాతీయ రహదారిపై వీధి దీపాల వెలుగులు మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి. ఇటీవల హైవే ఫ్లైఓవర్, సర్వీసు రోడ్లపై వీధి దీపాలు వెలగక దుత్తలూరు సెంటర్‌లో అంధకారం నెలకొంటుండడంపై 'సాక్షి'లో కథనాన్ని ప్రచురించగా హైవే అధికారులు స్పందించి హైవే నిర్వహణ సంస్థను ఆదేశించి దీపాలు వెలిగించారు. అయితే ఈ వెలుగులు కొద్దిరోజులకే పరిమితమయ్యాయి. మళ్లీ దుత్తలూరు సెంటర్‌లో చీకట్లు అలముకున్నాయి. హైవే అధికారులు స్పందించి అంతరాయం లేకుండా దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



ఘటనా స్థలంలో గాయపడిన నల్లబోతుల వేణు



శ్రీనివాసులును ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడు బస్టాండ్ వద్ద 67వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. కరటంపాడు పంచాయతీ సాతానుపల్లికి చెందిన పీ శ్రీనివాసులు (56) పల్సర్‌బైక్‌పై డీసీపల్లి వెళ్లాడు. పనిముగించుకుని తిరిగి స్వగ్రామానికి వస్తూ కరటంపాడు బస్టాండ్ సెంటర్ వద్దకు చేరుకున్నాడు. డీసీపల్లికి చెందిన నల్లబోతుల వేణు (23) స్కూటీపై ఆత్మకూరు వైపు నుంచి తన స్వగ్రామానికి వెళ్తూ పల్సర్‌బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను డీసీపల్లి టోల్‌గేట్ అంబులెన్స్ సిబ్బంది ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శ్రీనివాసులుకు కుడికాలు విరిగినట్లుగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఎస్సై జిలానీబాషా ప్రభుత్వాస్పత్రిలో క్షతగాత్రులను పరిశీలించారు. శ్రీనివాసులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.315

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.315 లభించింది. వేలానికి 862 బేళ్లు రాగా, 615 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.315, కనిష్టంగా రూ.70, సగటున రూ.183.40 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలంలో పది కంపెనీలకు చెందిన వ్యాపారప్రతినిధులు పాల్గొన్నారు.

12న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభలు

ఆత్మకూరురూరల్: నెల్లూరురూరల్ మండలం ములుమూడిలోని షాదీమంజిల్ వద్ద ఈ నెల 12న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 14వ జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన ఆత్మకూరులో విలేకరులతో మాట్లాడారు. జిల్లా మహాసభల్లో రైతాంగ సమస్యలపై చర్చించి పలు డిమాండ్‌లతో కూడిన తీర్మానాలను ఆమోదించనున్నట్లు తెలిపారు. ప్రధానంగా 22ఏ భూముల నిషేధిత జాబితాతో పాటు నోషనల్ ఖాతాల నుంచి రైతుల భూములను తొలగించి వాటిపై హక్కుదారులకు సంపూర్ణ హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా మహాసభలకు అందరూ ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు.

రక్తదానం



కావలి(అల్లూరు): కావలి రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో నాగరాజు మిత్రబృందం ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 27 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ కే హరినారపరెడ్డి మాట్లాడుతూ అకాల మరణం చెందిన నాగరాజు జయంతి సందర్భంగా గత ఐదేళ్లుగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న మిత్రులను అభినందించారు. రక్తశిబిరం నిర్వాహకులు జీ సాయి, గౌతమ్, బాలాజీలను రెడ్‌క్రాస్ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అనంతరం అన్నదానం చేశారు.

పట్టపగలే ఇంట్లో చోరీ



ఆత్మకూరురూరల్: పట్టపగలే దొంగలు ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన పట్టణంలోని ఉలవదిబ్బలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు..ఉలవదిబ్బకు చెందిన షకీలా సోమవారం ఉదయం ఇంటికి తాళం వేసి బుచ్చిరెడ్డిపాళెం వెళ్లింది. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. బీరువాలోని కొద్ది మొత్తం బంగారం, నగదును దొంగలు చోరీ చేసినట్లుగా బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఆత్మకూరు ఎస్సై జిలానీబాషా చోరీ జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీంతో ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పెద్దఅన్నలూరు అంగన్‌వాడీ కేంద్రానికి స్వచ్ఛ పురస్కారం



కలిగిరి: మండలంలోని పెద్దఅన్నలూరు అంగన్‌వాడీ కేంద్రాన్ని స్వచ్ఛ పురస్కారం వరించింది. నెల్లూరులోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ చేతుల మీదుగా అంగన్‌వాడీ కార్యకర్త పీ సునీతమ్మ పురస్కారాన్ని అందుకున్నారు.

జగనన్న విజయానికి సమష్టిగా కృషి



మాట్లాడుతున్న విష్ణు అనుచరులు

కావలి(అల్లూరు): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయం కోసం మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సమష్టిగా కృషి చేస్తారని కాటంరెడ్డి అనుచరులు అనంత బాలకృష్ణంరాజు, గోసాల గోపాల్‌రెడ్డి, పాలవల్లి పద్మనాభరెడ్డి స్పష్టం చేశారు. కావలిలోని జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం వారు మీడియా సమావేశం నిర్వహించారు. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని పక్కనపెట్టి విష్ణువర్ధన్‌రెడ్డికి జగన్‌మోహన్‌రెడ్డి పదవి ఇచ్చినట్లుగా, విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మాటలు లేనట్లుగా మీడియాలో వచ్చిన కథనాలను ఖండించారు. పెయిడ్ ఆర్టికల్స్‌తో దుష్ప్రచారాలు చేయడం తగదన్నారు. ఎమ్మెల్యే కావ్య కృష్ణా రెడ్డి వద్ద జీతాలు తీసుకొంటూ తప్పడు కథనాలతో దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు.జగన్‌మోహన్‌రెడ్డి, రామిరెడ్డి మాట్లాడుకున్నాకే విష్ణువర్ధన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియమించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని రామిరెడ్డి తన అనుచరులకు ముందురోజే తెలియజేయడం జరిగిందన్నారు. టీడీపీలో మాలేపాటి సుబ్బానాయుడు, బీద రవిచంద్రకు పదవులు ఇచ్చారని, అప్పుడు కావ్య కృష్ణారెడ్డిని పక్కన పడేసినట్లేనా అని ప్రశ్నించారు. రామిరెడ్డిపై అక్రమ కేసులు బనాయిస్తే విష్ణువర్ధన్‌రెడ్డి స్వయంగా ఫోన్ చేసి పరామర్శించారని తెలిపారు. కావలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా రామిరెడ్డి ఉంటారని ఆయన నాయకత్వంలో తామంత పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు కాటంరెడ్డి, రామిరెడ్డి ఇద్దరూ ఒక్కటేనని, పార్టీ కోసం సమష్టిగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అసత్య కథనాలతో దుష్ప్రచారం చేస్తే తీవ్రపరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. విష్ణువర్ధన్‌రెడ్డికి పార్టీ సెంట్రల్ కమిటీలో చోటు కల్పించిన జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హనిఫ్, మాధవ్‌రావు బాబు, బాలు తదితరులు పాల్గొన్నారు.


తాగునీటి సమస్యను పరిష్కరించాలని నిరసన



ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఖాళీ క్యాన్లతో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సోమశిల: అనంతసాగరం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో ఉన్న లేఅవుట్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అలాగే కొందరు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట బైఠాయించారు. అనంతరం ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్‌కు తమ సమస్యను వివరించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ కాలనీలో వేసిన మూడు బోర్లు ఫెయిల్ కావడంతో సమస్య ఏర్పడిందన్నారు. నీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆత్మకూరుకు స్వచ్ఛ పురస్కారం



ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మున్సిపాలిటీని స్వచ్ఛ పురస్కారం వరించింది. రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛతలో ఉత్తమ మున్సిపాలిటీగా ఎంపికైన నేపథ్యంలో అమరావతిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు, మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకటరమణమ్మ, కమిషనర్ గంగా ప్రసాద్ పురస్కారాన్ని అందుకున్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు




మర్రిపాడు: కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లిన ఘటన డీసీపల్లి వద్ద నెల్లూరు–ముంబయి జాతీయరహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. బద్వేల్ నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు డీసీపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఎస్సై శ్రీనివాసరావు స్థానికుల సాయంతో కారును పక్కకు తీశారు. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో ఎస్సై శ్రీనివాసరావు సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు.

ఆస్తిని కొట్టేసేందుకు క్షుద్ర పూజలు

- అన్నదమ్ముల నడుమ ఆస్తి వివాదం
- అన్నను భయభ్రాంతులకు గురిచేసేందుకు తమ్ముడి కుట్ర
- సీసీకెమెరాలో దొరికిపోయిన వైనం

ఉదయగిరి : క్షుద్ర పూజల పేరుతో అన్నను భయభ్రాంతులకు గురిచేసి మానసికంగా తుద ముట్టించి ఆస్తిని కొట్టేయాలని తమ్ముడు కుట్ర పన్నాడు. అన్న ఇంటి ముందు తరచూ క్షుద్రపూజలు అవశేషాలను వదిలి వెళ్లసాగాడు. అన్న సీసీకెమెరాను ఏర్పాటు చేయడంతో దొరికిపోయాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..వెంగళరావు నగర్‌కు చెందిన షేక్ జానీ, హనీఫ్, చాంద్‌బాషా సోదరులు. వీరు ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి బాగా సంపాదించారు. వీరి మధ్యన తల్లిదండ్రుల ఆస్తి పంపకాల విషయమై మూడేళ్ల నుంచి వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో చాంద్‌బాషా నెల్లూరుకు మకాం మార్చారు. నెల రోజుల క్రితం గల్ఫ్ నుంచి ఇంటికి వచ్చారు. వెంగళరావునగర్‌లో ఉంటున్న హనీఫ్‌కు అన్నదమ్ములతో పాటు గ్రామానికి చెందిన ఇతరులతో కూడా విభేదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హనీఫ్‌ను భయభ్రాంతులకు గురిచేసి మానసికంగా తుద ముట్టించి ఆస్తిని కొట్టేయాలనే ప్రణాళికను తమ్ముడు చాంద్‌బాషా రచించారు. నెల రోజులుగా అన్న ఇంటి ముందు క్షుద్రపూజలకు సంబంధించిన అవశేషాలను వదలసాగాడు. వాటిని చూసిన హనీఫ్ కుటుంబం ఎవరూ చేస్తున్నారో అర్థం కాక ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం చాంద్‌బాషా భార్య, హనీఫ్ భార్య నడుమ ఆస్తి విషయమై మరోమారు గొడవ జరిగింది. ఈ క్రమంలో అనుమానంతో హనీఫ్ ఎవరికీ తెలియకుండా తమ ఇంటి ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం హనీఫ్ ఇంటి ముందు క్షుద్రపూజల అవశేషాలు కనిపించడంతో సీసీ కెమెరా పుటేజీని పరిశీలించారు. అందులో అర్ధరాత్రి వేళ తమ్ముడు బైక్‌పై వచ్చి తన ఇంటి ముందు వదిలి వెళ్లడం రికార్డు అయింది. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించినట్లుగా సమాచారం. ఈ విషయమై ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డిని సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఆత్మీయ సమావేశం



ఆత్మకూరురూరల్: పట్టణంలోని సేవా సంఘాల ప్రతినిధుల ఆత్మీయ సమావేశాన్ని స్పార్క్ సిటీలో సోమవారం నిర్వహించారు. శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి, తెలుగుభారతి సేవా సమితి, వివిధ సేవా సంఘాల ప్రతినిధులు భవిష్యత్‌లో చేపట్టాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు.

వడ్డే ఓబన్నకు నివాళి



ఉదయగిరి రూరల్: కుర్రపల్లి బీసీ కాలనీలో తొలితరం స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న వర్ధంతిని వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఓబన్న చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ సైరా నరసింహారెడ్డికి సైన్యాధ్యక్షుడిగా పనిచేసిన ఓబన్న బ్రిటిష్ పాలకులను గడగడలాడించారన్నారు. ఓబన్న ప్రదర్శించిన ధైర్యాన్ని ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. వడ్డెర సంఘం జిల్లా నాయకులు నాగరాజు, తిరుపతి, పెంచల్ రాజు, లక్ష్మమ్మ, రమణయ్య, అంకమ్మ పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశాన వాటిక అభివృద్ధి పనుల ప్రారంభం



అల్లూరు: అల్లూరుపేట సత్రంలోని క్రైస్తవ శ్మశాన వాటికలో అభివృద్ధి పనులను యేసు అభిషేక మినిస్ట్రీస్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బ్రదర్ దేవరకొండ శ్యామ్‌యేలు బాబు ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ బ్రిటీష్ కాలంలో డేవిస్, బౌడెన్ దొరలు అల్లూరు ప్రాంతంలో మిషనరీలుగా పని చేసి క్రైస్తవులకు ప్రత్యేక శ్మశాన వాటికను ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ తర్వాత కాలంలో నిర్వహణ లోపంతో శ్మశానవాటికను వినియోగించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం శ్మశానంలోకి వెళ్లేందుకు వీల్లేక రహదారి పక్కనే మృత దేహాలను ఖననం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో తన సొంత నిధులతో శ్మశానాన్ని అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చినట్లు తెలిపారు. రూ.15లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణంతో పాటు ఇతర మౌలిక వసతులను కల్పించనున్నట్లు వివరించారు.